క్లుప్తంగా

పరుపుల కంపెనీలో అగ్ని ప్రమాదం



పట్నంబజారు: పట్టణంలోని ఓ పరుపుల కంపెనీలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటలోని మూడు వంతెనల సమీపంలో పాత పరుపుల మరమ్మతుల కంపెనీ ఉంది. దాన్ని ఆనుకుని ఉన్న సమోసాల కంపెనీ నుంచి ఊక నిప్పురవ్వలు పడి పరుపుల కంపెనీలో వస్తువులకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. రూ. 4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు పరుపుల కంపెనీ యజమాని తెల్లపాటి రమేష్ తెలిపారు.

'చలపతి' కళాశాలకు పదేళ్ల స్వయం ప్రతిపత్తి



గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాలకు పది సంవత్సరాల స్వయం ప్రతిపత్తిని కల్పిస్తూ ఆచార్య నాగార్జున వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆదేశాలు జారీ చేయాలని యూజీసీ శనివారం ఆదేశాలు జారీ చేయడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2004లో ఏర్పాటైన కళాశాల స్పెషలైజేషన్ కోర్సులతో విస్తరించిందన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ గుర్తింపు, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్, నాక్, జాతీయస్థాయిలో ఏ-ప్లస్ గ్రేడ్‌ను సాధించిందన్నారు. స్వయం పతిపత్తిని కలిగిన కళాశాలగా ఫార్మా విద్యారంగంలో రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం పొందడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23 నుంచి 'జగనన్న సురక్ష'

- అర్హులు, సమస్యలను గుర్తించేందుకు ఇంటింటికీ అధికారులు, ప్రజా ప్రతినిధుల సందర్శన
- కార్యాచరణపై నగరపాలక సంస్థ అధికారులకు అవగాహన సదస్సు



సభలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

పాత గుంటూరు: 'జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా ఈ నెల 23 నుంచి జులై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని అదనపు కమిషనర్ పెద్ది రోజా తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ కార్యదర్శులు ప్రాధాన్యతగా కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె చెప్పారు. రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణ, విధి విధానాలపై నగరపాలక సంస్థ అధికారులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మిగిలిన అర్హులు, సమస్యల్ని గుర్తించేందుకు ప్రతి ఇంటిని సందర్శించేలా సురక్షా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. ప్రతి గడపకు వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, వివిధ సర్టిఫికెట్స్‌పై ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని, అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు ఒకటి నుంచి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో పరిష్కారం కాని వినతుల్ని కూడా మరోసారి పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని చెప్పారు. ఒక వేళ అర్జీని తిరస్కరిస్తే అర్జీదారు ఇంటికి సంబంధిత సచివాలయ కార్యదర్శి, వలంటీర్ వెళ్లి వివరించాలని సూచించారు. కార్యదర్శులు కూడా తమ సచివాలయం పరిధిలో పథకాల లబ్ధిదారులు, అనర్హుల వివరాలతో జాబితా సిద్ధం చేసుకోవాలని అదనపు కమిషనర్ చెప్పారు.నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, పీవో రవీంద్ర, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ భానుప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, వార్డ్ సచివాలయ విభాగ సూపరింటెండెంట్ ప్రసాద్, నోడల్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాత గుంటూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



స్టేషన్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

పట్నంబజారు: జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ శనివారం పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పరిసరాలతో పాటు రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం.వి. సుబ్బారావు నుంచి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులకు న్యాయం జరిగేలా ముందుకు సాగాలని చెప్పారు. అనంతరం స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ ఉన్న నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట ఈస్ట్ డివిజన్ ఏఎస్పీ నిచికేష్ షలేకే, పాత గుంటూరు ఎస్ఐలు వెంకటేశ్వరరావు, వెంకట్రావు ఉన్నారు.

ఆధునిక బోధనతోనే పోటీ ప్రపంచంలో రాణింపు



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక బోధన పద్ధతులతోనే పోటీ ప్రపంచంలో రాణించగలమని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి సూచించారు. కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆంగ్ల మాధ్యమ బోధనలో భాగంగా రాష్ట్రంలోని 18 నోడల్ కేంద్రాల్లో వివిధ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులకు ఆంగ్ల మాధ్యమ బోధన, ట్రెనింగ్ ఆఫ్ ట్రెయినర్స్ రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సాంబశివపేటలోని మహిళా కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులతో పాటు మాస్టర్ ట్రెనర్లకు శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా అధ్యాపకులు ఆంగ్ల మాధ్యమంలో బోధన శైలిని అలవర్చుకుని, తద్వారా విద్యార్థుల్ని తీర్చిదిద్దాలని సూచించారు.

భళా.. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల



విద్యార్థినులతో డీవీఈవో పద్మ, ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు



కిట్లను అందిస్తున్న కార్పొరేటర్ మహమూద్, హెచ్ఎం

- ఒకే కళాశాల నుంచి జిల్లాస్థాయిలో నలుగురు ఆణిముత్యాలు
- ఒక్కొక్కరికీ రూ.50వేల ప్రోత్సాహకం అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విభాగంలో ప్రభుత్వం ప్రకటించిన జగనన్న ఆణిముత్యాలు నగదు ప్రోత్సాహకాలను ఒకే కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు అందుకున్నారు. గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి బైపీసీలో 978 మార్కులు సాధించిన షేక్ మెహతాబ్, హెచ్ఈసీలో 963 సాధించిన సీహెచ్. రమ్య, ఎంఈసీలో 962 మార్కులు పొందిన పి. కోమల్ కుమారి, ఎంపీసీలో 981 మార్కులు సాధించిన కొట్నాల మేఘన ఆయా విభాగాల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, ప్రభుత్వం నుంచి రూ.50వేలు చొప్పున నగదు బహుమతులు అందుకున్నారు. కేవీపీ కాలనీలోని కేఎస్ఆర్‌టీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాల్ని అందుకున్నారు. విద్యార్థినుల వెంట డీవీఈవో జె. పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత, అధ్యాపకులు ఉన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

పాత గుంటూరు: నాలుగో డివిజన్ వినోభా నగర్‌లోని మున్సిపల్ స్కూల్లో శనివారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. డివిజన్ కార్పొరేటర్ షేక్ మహమూద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు కిట్లను అందించారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, షేక్ నాగుల్ మీరా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లాసెట్‌లో నగర విద్యార్థినికి ర్యాంకు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన ఏపీ లాసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 42వ ర్యాంకు సాధించిన సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని గాదె సహస్రను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కులందై ట్రీజా అభినందించారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో సిస్టర్ కులందై ట్రీజా మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థిని లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సహస్రను అధ్యాపకులు అభినందించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం కళాలయ మెలోడీస్ సంస్థ వ్యవస్థాపకుడు ఏ.వి.రత్నాజీ ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి సంగీతాభిమానుల్ని అలరించింది. విశ్రాంత ఉద్యోగులు పి.మొగిలి, ఈ.భరత్‌రెడ్డి, వి.ఎల్. మల్లేశ్వరరావు, రత్నాజీ సినీ భక్తి గీతాల్ని శ్రావ్యంగా ఆలపించారు. కె.రవి బృందం వాయిద్య సహకారాన్ని అందించింది. అనంతరం సంస్థ నిర్వాహకులు కళాకారుల్ని సత్కరించారు.

నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఎస్పీ బాలు జయంతి పురస్కరించుకుని ఆదివారం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఏకే కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకుడు అమానుల్లా ఖాన్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

అప్పు తీసుకున్న వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

గుంటూరు రూరల్: హైవే కోసం భూసేకరణలో ఇచ్చేసిన స్థలాన్ని..అప్పు కింద తనఖా పెట్టి మోసం చేసిన వ్యక్తిపై నల్లపాడు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరులోని జేకేసీ కాలేజీ సమీపంలో నివాసితురాలు మద్దిశెట్టి సుజాత, అమరావతిరోడ్డులో నివాసం ఉంటున్న లక్ష్మిశెట్టి నరేంద్ర ప్రసాద్ కుటుంబ స్నేహితులు. సుజాత వద్ద నరేంద్ర ప్రసాద్ రూ.25 లక్షలు అప్పుగా తీసుకుని, వ్యాపారం చేశాడు. అది దెబ్బతినడంతో అప్పులయ్యాయని, నగదు చెల్లించలేనని సుజాతకు చెప్పాడు. దీనికి ఆమె కూడా ఒప్పుకోవడంతో మంగళగిరి మండలం చినకాకానిలో నరేంద్ర ప్రసాద్ అన్న పేరుతో ఉన్న స్థలాన్ని రిజిస్టర్ చేయించాడు. సుజాత కొంత కాలానికి స్థలం వద్దకు వెళ్లి చూడగా అది బైపాస్ కోసం ప్రభుత్వం పదేళ్ల క్రితం భూ సేకరణలో తీసుకున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో మోసపోయామని గ్రహించిన సుజాత పోలీసుల్ని ఆశ్రయించారు. విచారణ చేసి, నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

విద్యా సంస్థల బస్సులు సీజ్

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న విద్యా సంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. గత నాలుగు రోజులుగా జిల్లావ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా శనివారం 12 బస్సుల్ని సీజ్ చేశారు. నిబంధనలు పాటించకుండా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, లైసెన్సులు లేకుండా నడుపుతున్న బస్సుల యజమానులపై కేసు నమోదు చేశారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన నిశ్శంకరావు రాజ్ గోవింగ్ నాయుడు S/o. జయ ప్రకాష్, డోరు నెం. 5/ 164, ఏటుకూరు, గుంటూరు - 522017, ఆం.ప్ర. నుండి సంజాయిషి పొంది యావన్మందికి తెలియచేయునది...

నా క్లయింట్ నిశ్శంకర రాజ్ గోవింగ్ నాయుడు లోగడ మంత్ర కాటన్ ట్రేడర్స్ ప్రొప్రయిటర్ : తియ్యగూర వెంకటరత్నం భర్త తియ్యగూర వేమా రెడ్డి వారి వద్ద నుంచి గుంటూరు, ఏటుకూరు గ్రామం, బొంతపాడు రోడ్డులో గల టి.యం.సి. యూనిట్ అందలి మిషనరీ ల్యాండ్ నాకు విక్రయ అగ్రిమెంటు (తేది 02-09-2021) చేసియున్నారు. ఈ అగ్రిమెంట్ కాపీ బ్యాంక్ వారికి కూడా సమర్పించడమైనది. ఈ ప్రాపర్టీపై బయట వ్యక్తులు గానీ, ప్రభుత్వేతర సంస్థలు గానీ, ప్రైవేటు సంస్థలు గానీ ఎటువంటి లావాదేవీలు జరిపిన యెడల నా క్లయింట్ తీసుకుని సివిల్ - క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుగుదు.

షెడ్యూలు : అయిటం:-1 గుంటూరు డి. గుంటూరు సబ్, ఏటుకూరు గ్రామ పంచాయితీ ఏరియా ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని డి.నెం. 144/బి, మొత్తం విస్తీర్ణం య. 1-21 శెంట్లు భూమిలో నాకు హక్కు కలిగిన చ.గ. 581 లకు హద్దులు. తూర్పు: వేముల నాగ లక్ష్మమ్మ గారి స్థలము హద్దు-475 లిం., దక్షిణం: ఇతరుల తాలూకు స్థలము హద్దు, పడమర : వేముల నాగ లక్ష్మయ్య గారి స్థలము హద్దు-525 లిం., ఉత్తరం: రోడ్డు హద్దు-69 1/2 లిం. ఈ హద్దుల మధ్య చ.గ. 581 లు లేక చ.మీ. 485-77 లు.

అయిటం:-2: గుంటూరు డి. గుంటూరు సబ్, ఏటుకూరు గ్రామ పంచాయితీ ఏరియా ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని డి.నెం. 144/యఫ్, మొత్తం విస్తీర్ణం య. 2-38 శెంట్లు భూమిలో నాకు హక్కు కలిగిన చ.గ. 5541-8 లకు హద్దులు. తూర్పు : పాటిబేని అప్పారావు-ఇతరుల తాలూకు భూమిహద్దు -346.1/2 చ.అ., దక్షిణం: అడపాల దయాకర్ రెడ్డి భూమి హద్దు -126.06 చ.అ., పడమర: జిడుగు సుబ్బారావు మరియు చిట్యాల అప్పారావు-440.88 చ.అ. ఉత్తరం: గుంటూరు పత్తిపెరుకూరు ఆర్ & బి రోడ్డు హద్దు-149.16చ.అ. ఈ హద్దుల మధ్య చ.గ. 5541-8 లు లేక చ.మీ. 4633-50 లు.

వెరశి రెండు అయిటములు కలిపి చ.గ. 6122-8 లేదా చ.మీ. 5119-27 లు. ఈ హద్దుల మధ్య గల భూమి అందలి మిషనరీ, షెడ్లు, బిల్డింగ్ పూర్తిగా నాకు టిల్ కాంట్రాక్ట్ అగ్రిమెంట్ చేయబడినది. ఇందుతో యావన్మందికి తెలియజేయడమైనది.

ఇది పైన పేర్కొన్న ప్రయోజనం కోసం నా క్లయింట్కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర చట్టపరమైన హక్కులు మరియు నివారణలకు పక్షపాతం లేకుండా ఉంది.

షేక్ ఖాజా ఖుతుబుద్దీన్, అడ్వకేట్,
శ్యామలనగర్ 12/5వలైను, గుంటూరు. సెల్ నెం: 9160009003

పీజీ ఈసెట్‌లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీయూ ఇటీవల విడుదల చేసిన పీజీ ఈసెట్ ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఫార్మసీలో ప్రవేశానికి అర్హత కల్పించే పీజీ ఈసెట్‌కు కళాశాల నుంచి హాజరైన 23 మంది బీఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థులంతా ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వారిలో ఐదుగురు 250లోపు ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఎం.కీర్తన 61వ ర్యాంకు, ఎస్.వైష్ణవి, వై.సాంబశివరావు 96వ ర్యాంకు, బి.చిరు దివ్యబాయి 121వ ర్యాంకు, ఎస్‌జేవీఎస్ పవన్ 250వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరంతా వివిధ ఫార్మసీ కళాశాలల్లో ఎం.ఫార్మసీలో అడ్మిషన్ పొందేందుకు అర్హత పొందారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా రవికుమార్, ఓఎస్డీ పి.సీతారామయ్య, పీజీ ఈసెట్ కోచింగ్ ఇన్‌చార్జులు సీహెచ్. ప్రసాదరావు, వై.రత్నసింధు అభినందించారు.

మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

నెహ్రూనగర్: బీసీల అభ్యున్నతి కోసం బీపీ మండల్ చేసిన సిఫార్సులు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. హిందూ కాలేజీ సిగ్నల్ వద్ద గల మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద బీసీల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బీసీల స్థితిగతులు మార్చేందుకు బీపీ మండల్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు వై. కోటేశ్వరరావు(వైకే), జూపూడి శ్రీనివాసరావు, బత్తుల వీరాస్వామి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి: యువకుడిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాలరావుపేటకు చెందిన బాలికతో కోటేశ్వరరావు అనే యువకుడు స్నేహంగా మెలిగి ఈనెల 11న కిడ్నాప్ చేశాడు. ఆమెపై లైంగిక దాడి చేశాడు. బాలిక ఫిర్యాదు మేరకు శనివారం నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ప్రేమ పేరిట మోసం

యువతిని ప్రేమించి మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు చేబ్రోలుకు చెందిన నవీన్ నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఉద్యోగం చేస్తుంటాడు. అదే కళాశాలకు చెందిన ఉద్యోగిని ప్రేమిస్తున్నట్లు నటిస్తూ స్నేహంగా మెలిగాడు. యువతి పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు రూరల్: నగరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు శనివారం జగనన్న సురక్ష పథకంపై అవగాహన సదస్సును ఆర్‌డీవో ప్రభాకరరెడ్డి నిర్వహించారు. జూన్ 23 నుంచి జూలై 23 వరకూ సచివాలయాల పరిధిలో వలంటీర్లు సర్వే నిర్వహించి, ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను అందించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి జగనన్న సురక్ష పథకం గురించి వివరించడంతో పాటు ప్రజా సమస్యల్ని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ విజయశ్రీ, ఎంపీడీవో శోభారాణి, డెప్యూటీ తహసీల్దారు బిట్టు రమేష్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.